బస్టాండ్‌కు పూర్వవైభవం వచ్చేనా?

- 1936లో రైల్వేస్టేషన్‌కు అనుబంధంగా ప్రారంభమైన బాదేపల్లి బస్టాండ్
- బస్సులు రాక నిరుపయోగంగా మారిన వైనం


వెలవెలబోతున్న బాదేపల్లి బస్టాండ్

జడ్చర్ల టౌన్: నియోజకవర్గ కేంద్రంలోని బాదేపల్లి బస్టాండ్‌కు పూర్వవైభవం వస్తుందా అని పట్టణవాసులు వేచి చూస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో బస్టాండ్‌కు పూర్వవైభవం వస్తుందని ఆశించినప్పటికీ పట్టణవాసుల ఆశలు అడియాశలు అయ్యాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుండటంతో పట్టణవాసుల్లో ఆశలు మళ్లీ చిగురించాయి. తెలంగాణలో గొప్ప వ్యాపార కేంద్రంగా పేరుగాంచిన బాదేపల్లిలో 1936లో రైల్వే స్టేషన్ ఏర్పాటయ్యింది. అయితే ఉమ్మడి జిల్లాలోని నాగర్‌కర్నూలు, వనపర్తి, కల్వకుర్తి, కొల్లాపూర్ ప్రాంతాలకు రైలుసౌకర్యం లేకపోవటంతో ప్రయాణికులకు కష్టాలు ఆరంభం అయ్యాయి. దీంతో స్టేషన్ పక్కనే అనుబంధంగా బస్టాండ్‌ను ప్రారంభించారు. వివిధ మార్గాల ద్వారా బస్టాండ్‌కు చేరుకున్న ప్రయాణికులు హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు రైలుమార్గాన్ని వినియోగించేవారు. ఇదే క్రమంలో స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత బాదేపల్లి బస్టాండ్‌కు ఎంతో ప్రాముఖ్యత పెరిగింది. రాయలసీమ ప్రాంతానికి సైతం ఇదే బస్టాండ్ ద్వారా బస్సులు రాకపోకలు సాగించేవి. 1983లో జాతీయరహదారిపై ప్రస్తుత జడ్చర్ల బస్టాండ్ ప్రారంభించటంతో బాదేపల్లి బస్టాండ్‌కు కష్టాలు మొదలయ్యాయి. కాలక్రమేణా గ్రామీణప్రాంతాలకు బస్సుల రాకపోకలు తగ్గటం, ప్రైవేట్‌వాహనాల హవా కొనసాగటంతో బస్టాండ్ ద్వారా వెళ్లే ప్రయాణికుల సంఖ్య తగ్గిపోయింది. దీనికి తోడు రైల్వేగేట్ సమస్య కారణంగా వనపర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూలు ప్రాంతాలనుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులు బస్టాండ్‌కు రాకుండా నేరుగా సిగ్నల్‌గడ్డ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం కల్వకుర్తి డిపో బస్సులు మాత్రమే బస్టాండ్‌కు వచ్చి వెళ్తున్నాయి. దీంతో పూర్తిగా నిర్మానుష్యంగా మారింది. దశాబ్దం కిందటి వరకు బస్సులతో రద్దీగా ఉన్న బస్టాండ్ నేడు వెలవెలబోతుంది. దీంతో పాతబజార్ ప్రాంతం అభివృద్ధికి దూరంగా ఉండిపోతోందని స్థానికులు అంటున్నారు.

బైపాస్ పేరుతో

నాగర్‌కర్నూలు, వనపర్తి, కొల్లాపూర్ నుంచి వచ్చే బస్సులు బైపాస్‌అనే బోర్డుతో బస్టాండ్‌కు రాకుండా నేరుగా వెళ్తున్నాయి. వాస్తవానికి జడ్చర్ల కేంద్రంలో బైపాస్ రోడ్డు లేనప్పటికీ షాద్‌నగర్ బైపాస్ రోడ్డును సాకుగా చూయిస్తూ నేరుగా వెళ్లిపోతున్నాయి. ఈ కారణంగా పాతబజార్ ప్రాంతవాసులు దూర ప్రాంతాలకు వెళ్లాలంటే కొత్త బస్టాండ్, నేతాజీ చౌరస్తాలకు వెళ్లాల్సి వస్తుంది. ఇందుకు ఆటో ఖర్చులు అదనంగా భరించాల్సి వస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో బస్టాండ్‌కు పూర్వవైభవం తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. బాదేపల్లి పట్టణంలో బస్టాండ్ లేకుండా పోవటం వల్ల ఎలాగైనా పునరుద్ధరించాలన్న డిమాండ్ పెరుగుతోంది. పట్టణం మీదుగా వెళ్లే అన్ని బస్సులు బాదేపల్లి బస్టాండ్‌కు వచ్చి వెళ్లేలా చర్యలు తీసుకుంటే పాతబజార్‌లో అన్ని విధాలుగా అభివృద్ధికి ఆస్కారం కలుగుతుంది. ముఖ్యంగా బస్టాండ్‌కు అనుబంధంగా హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలు వృద్ధి చెందే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రస్తుతం పాతబజార్ ప్రాంతం సాయంత్రం ఆరుదాటిందంటే జనసంచారం లేక నిర్మానుష్యంగా మారుతోంది.

మహిళలకు ప్రయోజనం

తాము అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూ ఆరు గ్యారెంటీల్లో ఒకటిగా హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ బస్టాండ్‌కు పూర్వవైభవం తీసుకు వస్తేనే మహిళలకు మేలు కలుగుతుంది. లేదంటే జడ్చర్ల బస్టాండ్, నేతాజీ చౌరస్తాల వరకు ఆటోల్లో వెళ్లి బస్సు ప్రయాణం చేయాల్సి వస్తుంది. దీంతో ఎమ్మెల్యేగా ఎన్నికైన జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి పూర్వవైభవం తీసుకురావాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

బస్సులు వచ్చేలా చూడాలి



బాదేపల్లి బస్టాండ్‌కు అన్ని బస్సులు వచ్చేలా చూడాలి. బస్సులు రానందున ఎంతో ఇబ్బంది కలుగుతోంది. దూర ప్రాంతాలకు వెళ్లాలంటే ఆటోలో జడ్చర్ల బస్టాండ్‌కు వెళ్లి అక్కడినుంచి పోవాల్సి వస్తోంది. ఎలాగూ మహిళలకు బస్సు ప్రయాణం ఉచితం అని అంటున్నందున అన్ని బస్సులు వచ్చి పోతే మాకు సౌకర్యంగా ఉంటుంది. మహిళలకు ఎంతో మేల కలుగుతుంది.

–నాగలక్ష్మి, పాతబజార్, బాదేపల్లి

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం



బాదేపల్లి బస్టాండ్‌కు అన్ని బస్సులు వచ్చి పోయేలా చూడాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తాం. మహిళలకు బస్సు ప్రయాణం ఉచితంగా కల్పిస్తున్నందున అన్ని బస్సులు వస్తేనే మేలు కలుగుతుందని కోరతాం. వనపర్తి, నాగర్‌కర్నూలు, కొల్లాపూర్ డిపోల బస్సులు వచ్చిపోయేలా అక్కడి అధికారులతో సంప్రదింపులు జరిపిస్తాం.

–శాగంటి రఘు, పాతబజార్, బాదేపల్లి

ఘంటసాల జయంతి

జడ్చర్ల టౌన్: సంస్కారభారతి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ఘంటసాల జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ఆయన మధురగీతాలను విన్నారు. కార్యక్రమంలో సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ, సహాయ పౌండేషన్ సభ్యులు మంజుల, శోభారాణి, బాలమణి, పద్మ, మనీషా, శ్రీదేవిలు పాల్గొన్నారు.

ఎస్సీఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం దేశవ్యాప్తం చేయాలి

హన్వాడ: ఎస్సీఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని దేశవ్యాప్తం చేయాలని నేషనల్ అలెయన్స్ ఆఫ్ అగ్రికల్చర్ అలైడ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం ఢిల్లీ లోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన దళిత్ మార్చ్ టూ పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సామాజిక న్యాయం సాధన కోసం ప్రతిఒక్కరు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నాయకులు వెంకటయ్య, నాగన్న, నర్సింలు, శంకర్, పులి కల్పన, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి రూ. 5 లక్షల చెక్కు అందజేత

దేవరకద్ర రూరల్: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త అజ్జు ఇటీవల గుండెపోటుతో మరణించాడు. కాగా సోమవారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి బాధిత కుటుంబం నివాసానికి వెళ్లి.. సొంతంగా రూ. 5 లక్షల చెక్కును మృతుడి భార్యకు అందజేశారు. భవిష్యత్‌లో కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ఆన్‌లైన్ చేయాలి

నవాబుపేట: ప్రభుత్వం గ్రామాల్లో రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది ధాన్యం కొన్న వెంటనే ఆన్‌లైన్ చేయాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రైతుల ధాన్యం కొన్న వెంటనే రైతు పేరున ఆన్‌లైన్ ప్రాసెస్ చేయకుంటే వారికి బిల్లులు రావని అన్నారు. అందుకే వెంట వెంటనే వాటిని ఆన్‌లైన్ చేయాలన్నారు. కాగా మండలంలో 5 మహిళా సంఘాల ద్వారా, 5 కేంద్రాలు సహకార సంఘం ద్వారా కొనుగోలు చేస్తున్నారు. వీటిలో లింగంపల్లిలో మాత్రం ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం అయ్యిందని మిగత కేంద్రాల్లో నత్తనడకన కొనసాగటంతో రైతులకు ధ్యాన్యం బిల్లులు ఆలస్యం అవుతున్నాయని వెంటనే ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టాలని ఆయన సిబ్బందికి సూచించారు.

టార్గెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థికి సన్మానం



మహబూబ్‌నగర్ క్రీడలు: నేపాల్ రాజధాని ఖాట్మండ్‌లో ఈనెల 8 నుంచి 11 వరకు జరిగే అంతర్జాతీయ టార్గెట్‌బాల్ ప్రెసిడెంట్ కప్ పోటీలకు స్థానిక ఎంవీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థి మస్రత్‌ఉన్నిసా ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి తెలిపారు. సోమవారం కళాశాలలో విద్యార్థిని శాలువాతో సత్కరించారు. పోటీల్లో మెరుగైన ప్రతిభచాటాలని కోరారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సత్యభాస్కర్ రెడ్డి టోర్నీలో పాల్గొనేందుకు రవాణా ఖర్చుల కోసం ఆర్థిక ప్రోత్సాహం అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

శపథం చేసి.. గుండు కొట్టించుకొని



మక్తల్: నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఓడిపోవాలని, కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి గెలుపొందాలని శపథం చేశానని.. ఈ మేరకు చిట్టెంను ఓడించిన పడమటి ఆంజనేయస్వామి వారికి సోమవారం ఉదయం తెల్లవారుజామున తలనీలాలు ఇచ్చి గుండు కొట్టించుకున్నట్లు మక్తల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవికుమార్‌యాదవ్ తెలిపారు. మక్తల్‌లో వాకిటి శ్రీహరిని ప్రజలు గెలిపించడంతో పడమటి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

కేఎస్పీ కాల్వలకు మరమ్మతు చేయాలి



మరికల్: కోయిల్‌సాగర్ లింక్ కెనాల్ కాల్వలో ముళ్లచెట్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. తీలేర్ పంపుహౌస్‌నుంచి కంసాన్‌పల్లి వరకు కాల్వ మొత్తం ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలతో నిండి ఉండటంతో వర్షకాలంలో కాల్వకు గండిపడే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి కోయిల్‌సాగర్ ప్రధాన కాల్వలతోపాటు పిల్ల కాల్వలను మరమ్మతులు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

జోరుగా యాసంగి సాగు

మరికల్: వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు యాసంగి సాగుపై దృష్టిసారించారు. మండలంలో ఇప్పటికే వేరుశనగ, ఆముదాలు, కీరదోస, వివిధ రకాల చిరుధాన్యాల పంటలు సాగు చేశారు. 234 ఎకరాల్లో వేరుశనగ, 246 ఎకరాల్లో ఆముదం, పదుల సంఖ్యలో చిరుధాన్యాల పంటలు సాగు చేయగా, వరి విషయానికి వస్తే 3 వేలకు పైగా వరిసాగు చేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పుడిప్పుడే నారుమళ్లు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ బోర్లలో నీరు తగ్గుతుండటంతో రైతులు కలవరపడుతున్నారు.



ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం : ఆల


మాట్లాడుతున్న ఆల వెంకటేశ్వర్ రెడ్డి

దేవరకద్ర రూరల్: 'నా జీవితం దేవరకద్ర నియోజకవర్గ ప్రజలకే అంకితమని.. ఎన్నికల్లో తనపై నమ్మకంతో విశ్వాసంతో ఓటు వేసిన ప్రజలకు, అలాగే తన కోసం ఎన్నికల్లో కష్టపడిన కార్యకర్తలకు, నాయకులకు, ప్రజాప్రతినిధులకు రుణపడి ఉంటానని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం దేవరకద్రలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాతీర్పును గౌరవస్తున్నామని తెలిపారు. తనను ప్రజలు ఎంతో ఆదరించారని అన్నారు. స్వల్ప తేడాతో ఓడిపోయామని, ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని ఎవరూ నిరాశ చెందవద్దని కోరారు. ప్రజాక్షేత్రంలో నిరంతరం ప్రజల తరుపున పోరాడుతామని, అన్నారు. విజయం సాధించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసూధన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ రమాదేవి, నాయకులు కాటం ప్రదీప్‌కుమార్ గౌడ్, జెట్టి నర్సింహ రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, కర్ణం రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

కోయిల్‌కొండ: యువతీ, యువకులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బీసీ గురుకుల పాఠశాలకు చెందిన ఎస్.కృష్ణా ఆసియా ప్రెసిడెంట్ కప్ టార్గెట్ బాల్ పోటీలకు ఎంపికైన సందర్భంగా ఎస్‌ఐ విజయ్‌భాస్కర్, సర్పంచ్ కృష్ణయ్య తదితరులు విద్యార్థిని శాలువాతో సత్కరించి అభినందించారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో కోయిల్‌కొండ విద్యార్థి ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కుమ్మరిరాజు, ఖాజ, అప్పి, మోహిన్, నాజీమ్, రవి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థితో ఎస్‌ఐ తదితరులు

నాలా పునరుద్ధరించకుండానే బీటీ రోడ్డు!


బీటీ వేసేందుకు సిద్ధం చేస్తున్న రోడ్డు (ఫైల్)

బాలానగర్: మండలపరిధిలోని మోతీఘణాపూర్ గ్రామానికి వెళ్లే ముఖ్యకూడలి వైపు జాతీయ రహదారి–44పై చిన్నపాటి వర్షానికి రోడ్డుపై వర్షపు నీరు నిలిచి వాహనదారులకు ఇబ్బందికరంగా మారిన పరిస్థితి నేపథ్యంలో వెంచర్ నిర్వాహకులు మూసివేసినా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఘటనపై టోల్ ప్లాజాలో ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించడం లేదని పలువురు వాపోతున్నారు. ప్రస్తుతం జాతీయ రహదారి బీటీ రోడ్డును రెన్యూవల్ చేస్తున్నారు. అయితే ఈ సమయంలో నీరు నిలిచే సమస్యకు పరిష్కారం లభిస్తుందని గ్రామస్తులు భావించారు. అయినా రాయికల్ టోల్ ప్లాజా అధికారుల తీరు మాత్రం మారలేదు. ఉన్న రోడ్డుకు, నాలా వద్ద వర్షపు నీరు పోయేందుకు ఎలాంటి మరమ్మతు, చర్యలు చేపట్టకుండానే తిరిగి బీటీ రోడ్డును వేసి వదిలేశారు.

రోడ్డు ఎత్తు పెంచకుండానే బీటీ రెన్యూవల్

అదేవిధంగా బాలానగర్ మండల కేంద్రంలోని ముఖ్య కూడలి వద్ద బీటీ రోడ్డు సీసీ రోడ్డు కంటే కిందకు వేశారు. దీంతో వర్షపు నీరు, ఇతర నీరు రోడ్డుపై చేరి అక్కడ వేసిన బీటీ తేలిపోయి గుంతలమయంగా తయారవుతోంది. ఈ సమస్యపై రాయికల్ టోల్ ప్లాజా నిర్వాహకులకు గ్రామ పెద్దలు విన్నవించినా పరిస్థితి మాత్రం మారలేదు. దీంతో కొద్ది రోజుల్లోనే ఉన్న బీటీపోయి మళ్లీ గుంతలమయంగా మారక తప్పదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సొంత మండలంలో రాజేందర్‌రెడ్డికి ఎదురుదెబ్బ

- పర్ణికారెడ్డికి ఆధిక్యం కట్టబెట్టిన కోయిల్‌కొండ



కోయిల్‌కొండ: నారాయణపేట మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి గత రెండు సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో సొంత మండలం కోయిల్‌కొండలో ఆధిక్యం రాగా.. తాజా ఫలితాల్లో మాత్రం ఎదురుదెబ్బ తప్పలేదు. 2014లో రాజేందర్‌రెడ్డికి 12,203 ఓట్లురాగా, అప్పటి టీఆర్‌ఎస్ అభ్యర్థి శివకుమార్‌రెడ్డి 9,328 ఓట్లు వచ్చాయి. దీంతో అప్పట్లలో రాజేందర్‌రెడ్డికి 2, 875 ఆధిక్యం దక్కింది. 2018లోనూ 5,517 ఓట్ల మెజార్టీ వచ్చింది. అయితే ఈసారి శివకుమార్‌రెడ్డి మేనకోడలు చిట్టెం పర్ణికారెడ్డితో ఆయన పోటీ పడ్డారు. తాజా ఫలితాల్లో పర్ణికారెడ్డికి 21,512 ఓట్లు రాగా..రాజేందర్‌రెడ్డికి కేవలం దీంతో 17,965 ఓట్లు వచ్చాయి. దీంతో పర్ణికారెడ్డికి 3547 ఓట్ల మెజార్టీ వచ్చింది. సొంత మండలంలో ఎదురుదెబ్బ తగలడం కూడా రాజేందర్‌రెడ్డి ఓటమికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. మొత్తం 61 పోలింగ్ కేంద్రాల్లో మోదీపూర్(7), ఎల్లారెడ్డిపల్లి(10), వింజామూర్12, చందాపూర్(20), ఇబ్రహీంనగర్ (21), ఖాజీపూర్(28) తదితర కొన్నిచోట్ల మాత్రమే ఆయనకు ఆధిక్యం వచ్చింది. మిగతా చోట్ల పర్ణికారెడ్డి ఆధిక్యంలో దూసుకుపోయింది.

మన్యంకొండలో కాంగ్రెస్ నాయకుల పూజలు

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పాటు మహబూబ్‌నగర్ నియోజకవర్గ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఘన విజయం సాధించిన నేపథ్యంలో సోమవారం మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామిని నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మాధవరెడ్డి, గోవింద్‌యాదవ్, నాయకులు ఉన్నారు.

గ్రహణమొర్రి స్క్రీనింగ్ క్యాంప్

నారాయణపేట రూరల్: బసవతారకం స్మైల్ ట్రైన్ సెంటర్, ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి, సమగ్రశిక్ష సంయుక్తంగా సోమవారం నారాయణపేటలో నిర్వహించిన ఉచిత గ్రహణమొర్రి స్క్రీనింగ్ క్యాంప్‌కు పెద్దగా స్పందన కనిపించలేదు. పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా సమీపంలోని భవితకేంద్రంలో ఏర్పాటుచేసిన శిబిరానికి కేవలం ఒకరు మాత్రమే బాధితరోగి వచ్చారు. దీంతో డాక్టర్ ముకుందారెడ్డి వాట్సప్‌ద్వారా పరిశీలించారు. భవిష్యత్‌లో కనీసం పదికంటే ఎక్కువ మంది ఉంటే క్యాంప్ చేపడుతున్నట్లు తెలిపారు.

'పేట'లో అయ్యప్ప పూజ

నారాయణపేట రూరల్: పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి భక్తుడు తమ్మలి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అయ్యప్ప మాలాధారులు హాజరై భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గురుస్వామి ఉమాపతి, సురేందర్, రాము, బాలరాజు, లింగు, వెంకటప్ప, శ్రీధర్ పాల్గొన్నారు.



ఆరు గ్యారంటీలే గెలిపించాయి


గాధిర్యాల్‌లో సంబరాలు చేస్తున్న నాయకులు

గండేడ్: ఆరు గ్యారెంటీలు, ప్రభుత్వంపై వ్యతిరేకతే కాంగ్రెస్ గెలుపునకు తోడ్పాటునందించాయని మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం విలేకర్లతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమం కంటే ప్రజలు కష్టాలే ఎక్కువగా అనుభవించారన్నారు. మండల ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

సంబరాల్లో కాంగ్రెస్ నాయకులు

మహమ్మదాబాద్/గండేడ్: దాదాపు పదేళ్ల తరువాత కాంగ్రెస్ విజయం సాధించడంతో ఉమ్మడి గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. రామ్మోహన్ రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడంతో కార్యకర్తలు, నాయకులు ఆయన నివాసానికి క్యూకట్టారు. రేవంత్‌కు అతి సన్నిహితుడిగా ఉండటంతో పరిగి ఎమ్మెల్యేకు మంత్రి పదవికూడా దక్కవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

కులమతాలకతీతంగా కాంగ్రెస్‌ను ఆదరించారు



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎన్నికల్లో కులమతాలకతీతంగా ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో అరాచక పాలన, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. పార్టీ పారదర్శక పాలన అందిస్తుందన్నారు. టీఎన్‌జీవో జిల్లా మాజీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, జిల్లా మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మండల నాయకులు


ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో మండల నాయకులు

నవాబుపేట: తాజా ఎన్నికలలో విజయం సాధించిన జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని సోమవారం మండల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. బంగ్లరవి, ఖజా, జహీర్ అక్తర్, రాంచంద్రయ్య, నీల్యానాయక్, అంజనేయులు, కుమార్, అజహార్ తదితరులు ఉన్నారు.

బాలానగర్: జడ్చర్ల నియోజకవర్గంలో జనం మధ్యలో ఉండి జనం కోసం చేసిన కార్యక్రమాలతో పాటు కేసీఆర్ నియంతృత్వ పాలనతో ప్రజలు విసిగిపోవడం అనే అంశాలు జనంపల్లి అనిరుధ్‌రెడ్డికి భారీ ఆధిక్యం అందించాయని మండల అధ్యక్షుడు శంకర్ నాయక్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి అన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గెలుపుకోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. వెంకటేశ్వర్ రెడ్డి, వెంకట్ నాయక్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు బాగు చేయండి


అధ్వానంగా నందిపేట-జీనగరాల రోడ్డు


దాసర్‌పల్లి నుంచి వెళ్లే మట్టిరోడ్డు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని నందిపేట నుంచి దేవరకద్ర మండలంలోని జీనగరాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై బీటీ తేలిపోవడంతో పాటు రోడ్డుపై అడుగుకోగుంత ఏర్పడింది. నందిపేట నుంచి జీనగరాల వరకు సుమారు 3.5కిలోమీటర్ల దూరం ఉన్న బీటీరోడ్డు పూర్తి గుంతలమయంగా మారింది. రోడ్డుపై ఏర్పడిన గుంతలతో ద్విచక్రవాహనాలు, ఆటోలు వెళ్లడానికి ఇబ్బంది ఎక్కువైంది. గుంతలతో పాటు రోడ్డు నిండా కంకర తేలడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. నందిపేటతో పాటు అడ్డాకుల మండలంలోని రాచాల, పొన్నకల్, దుబ్బపల్లి, కందూర్, శాఖాపూర్, మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లి గ్రామస్తులు ఇదే దారిలో దేవరకద్రకు రాకపోకలు సాగిస్తారు. ఈనేపథ్యంలో నందిపేట-జీనగరాల రోడ్డును బాగు చేయించాలని ప్రయాణీకులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మూసాపేట మండలంలోని దాసర్‌పల్లి గ్రామం నుంచి అడ్డాకుల మండలంలోని పొన్నకల్ గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో పాటు రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగాయి. దీనివల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో రోడ్డుపై ఉన్న గుంతల్లో వర్షం నీళ్లు నిలిచి వాహనాలు వెళ్లడానికి వీలు లేకుండా మారుతుంది. దీనివల్ల పొన్నకల్ గ్రామస్తులు దాసర్‌పల్లి వెళ్లడానికి నందిపేట వై జంక్షన్ మీదుగా చెన్నంపల్లి దాటి వెళ్తున్నారు. దీంతో నాలుగైదు కిలోమీటర్ల దూరం అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఈ రోడ్డును బాగు చేయిస్తే రెండు గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. దీంతో ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.